క్లుప్తంగా

ప్రాధాన్యతా క్రమంలో అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రెయిన్లు

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



జగ్గయ్యపేట అర్బన్: పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రాధాన్యతా క్రమంలో అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రెయిన్లు ఏర్పాటుచేస్తామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. పట్టణంలోని 5వ వార్డు చింతలతోపులో వట్టెం సాంబశివరావు వీధిలో సుమారు రూ. 4 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం మున్సిపల్ చైర్మన్ శంకుస్థాపన చేశారు. అలాగే 7వ వార్డులో జరుగుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు కాలంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సూచనల మేరకు పట్టణంలో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.మల్లేశ్వరరావు, కౌన్సిలర్ వట్టెం మనోహర్, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్ బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పూసాల పుల్లారావు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



భీమవరం(వత్సవాయి): వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గ్రామంలోని గాంధీ సెంటర్లో మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేసి శనివారంతో 27 రోజులకు చేరుకుంది . దాతలు సహకారంతో వేసవి దాహాన్ని తీర్చేందుకు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చార్టర్ అధ్యక్షుడు బొగ్గవరపు వెంకటరాజారావు తెలిపారు. ఎండలు తగ్గేవరకు శిబిరాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మద్దు హరిబాబు, కార్యదర్శి కూర్మాల జనార్దనరావు, రవికిరణ్ పాల్గొన్నారు.

ఆలయానికి విరాళాలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయానికి శనివారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. ఆలయంలోని ఉపాలయం అంకమ్మవారి ఆలయ గోపురం వెండి తాపడం తయారీకి ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, విజయలక్ష్మీ దంపతులు కాకాని వెంకమ్మ జ్ఞాపకార్థం రూ.10,001 విరాళంగా అందజేశారు. అలాగే ఖమ్మం జిల్లా, బోనకల్లు మండలం ఎల్ గోవిందపురం గ్రామానికి చెందిన ధర్మపురి నరసింహారావు, లక్ష్మీ దంపతులు గోశాలలోని గోవుల సంరక్షణకు రూ.13 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

కారు బోల్తా

మక్కపేట(వత్సవాయి) : కారు అదుపుతప్పి బోల్తా కొట్టిన సంఘటన శనివారం తెల్లవారుజామున చిల్లకల్లు వైరా రహదారిపై గ్రామశివారులో చోటుచేసుకుంది. జగ్గయ్యపేటకు చెందిన ఒక కుటుంబసభ్యులు పెనుగంచిప్రోలులో జరిగిన ఒక వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి వెళుతున్న సమయంలో కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. అనంతరం కారును క్రేన్‌తో తొలగించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నందిగామ: జాతీయ రహదారిపై నందిగామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై పండు దొర తెలిపిన సమాచారం ప్రకారం ఒడిశాకు చెందిన మానస్ సుందర్రై(32) విజయవాడ వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు 65వ నంబర్ జాతీయ రహదారిపై నందిగామ సమీపంలోని ఫ్లైఓవర్‌పై వాహనం అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ మానస్‌ను వెంటనే నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం ప్రథమ చికిత్స అనంతరం విజయవాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

పథకాలను అందించే సారథులు వలంటీర్లు



వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందించే సారథులు వలంటీర్లు అని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విశిష్ట సేవలందించిన వలంటీర్లను ఘనంగా సత్కరించి ప్రభుత్వం అందిస్తున్న సేవా పురస్కారాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్లు అందిస్తున్న సేవలు ఎనలేనివన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.

ప్రాణాలను పణంగా పెట్టి సేవలు

కరోనా సమయంలో వలంటీర్లు తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించారని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు పేర్కొన్నారు. కరోనా సమయంలో గ్రామాలలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిని గుర్తించడం, వారికి పరీక్షలు చేయించడంతో పాటు బాధ్యతాయుతమైన పని తీరుతో కరోనాను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో వలంటీర్లు తమ వంతు కృషి చేశారని గుర్తు చేశారు. అంతే కాకుండా తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తూ అవ్వాతాతల అభిమానాన్ని చూరగొంటున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ఇతర రాష్ట్రాలలో సైతం ప్రవేశపెట్టేందుకు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు సంసిద్ధమవుతున్నాయని చెప్పారు.

ప్రజల ఇళ్ల వద్దకే పాలన

వలంటీర్ వ్యవస్థతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఇళ్ల ముంగిటకే పాలన తీసుకొచ్చారని జగన్‌మోహనరావు కొనియాడారు. ఎంతో విలువైన సేవలందిస్తున్న వలంటీర్లను సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలతో సత్కరించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల సుందరమ్మ, వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, వైస్ ఎంపీపీలు ఆకుల రంగా, అన్నం పిచ్చయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ పద్మజ్యోతి, సర్పంచ్ రవికిరణ్ రెడ్డి, నాయకులు చిరుమామిళ్ల కిరణ్, ఐలపోగు రాంబాబు పాల్గొన్నారు.

సొంతింటి కలను సాకారం చేసిన సీఎం



జగనన్న కాలనీలో నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వవిప్ ఉదయభాను

లింగాల(వత్సవాయి): రాష్ట్రంలోని పేదలకు సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాకారం చేశారని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. శనివారం గ్రామంలోని జగనన్న కాలనీలో నూతనంగా నిర్మాణం చేసిన ఆంబోజి భాస్కరరావు గృహాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లలో భాగంగా గ్రామాలలో నూతన గృహాలు వేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. కాలనీలు గ్రామాలుగా రూపాంతరం చెందే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాజధాని ప్రాంతంలో పేదలు 50 వేల మందికి పైగా పట్టాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ప్రతిపక్షాలు కుట్రలు తిప్పికొట్టి జగనన్నకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు యేశాల కనకచందరరావు, సచివాలయ కన్వీనర్ అంబోజి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

ప్రభుత్వ విప్ ఉదయభాను



వలంటీర్లను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటరీ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. శనివారం రాత్రి స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పట్టణానికి చెందిన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్తమ సేవలు అందిస్తున్న వలంటీర్లకు ప్రభుత్వం వరుసగా మూడో విడత అవార్డులను ప్రదానం చేసిందన్నారు. సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్ర పేరిట అవార్డులు పొందిన వలంటీర్లను సత్కరించి మాట్లాడారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తూ సంక్షేమ పథకాలను అందిస్తున్న వార్డు వలంటీర్ల సేవలు మరువలేనివన్నారు. పట్టణంలో 280 మంది వలంటీర్ల వందనం కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషదాయకం అని ఎమ్మెల్యే అన్నారు. సేవా వజ్ర అందుకున్న ధారా వసంతకుమార్, గాదె నాగమణిలను సత్కరించారు. అలాగే సేవా మిత్ర అందుకున్న ఐదుగురు వలంటీర్లను సేవలను కొనియాడారు.

అభివృద్ధి అంతా తమ హయాంలో చేసిందే

నియోజకవర్గ వ్యాప్తంగా ముఖ్యమైన అభివృద్ధి అంతా తమ హయాంలో చేసిందేనని, మాజీ ఎమ్మెల్యే తాతయ్య హయాంలో చేసిందేమిటో చూపించాలన్నారు. తన హయాంలో మున్సిపల్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, ఉక్కు కళావేదిక, ధనంబోడులో జిల్లాలో ఎక్కడా లేని విధంగా మోడల్ కాలనీ, రూ.3 కోట్లతో ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి, 30 పడకల నుంచి 50 పడకలకు పెంపు, పట్టణంలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు, చిల్లకల్లు–జగ్గయ్యపేట మధ్య రూ.14 కోట్లతో ఫోర్‌లేన్ రోడ్డు, రూ.10 కోట్లతో చెరువు అభివృద్ధి, టీటీడీ కల్యాణ మండప నిర్మాణానికి శ్రీకారం ఇలా పలు అభివృద్ధి కార్యక్రమాలు తమ హయాంలోనే జరిగినవని పేర్కొన్నారు. తమ హయాంలో రూ.కోటితో నిర్మించిన టౌన్‌హాల్‌ను ఆ తరువాత వచ్చిన శ్రీరాం తాతయ్య పట్టించుకోకుండా శిథిలావస్థకు తీసుకువచ్చారన్నారు. మళ్లీ తాము అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, వాడుకలోకి తీసుకువచ్చానన్నారు. 2008లో తాము శంకుస్థాపన చేసిన టీటీడీ కల్యాణమండపాన్ని పదేళ్ల అధికారంలో ఉండి కూడ శ్రీరాం తాతయ్య నిర్మించలేని అసమర్థ ఎమ్మెల్యేగా పేరు తెచ్చుకున్నారన్నారు. ఇప్పుడు తాను నిధులు మంజూరు చేయించి నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు రంగాపురం రాఘవేంద్ర, తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బీమా చెక్కు అందజేస్తున్న జ్యోతిబ్రహ్మం

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఉప్పాల లక్ష్మణరావు ఇటీవలన అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్ బీమా కింద తక్షణ ఖర్చుల కింద మంజూరైన రూ. 10 వేలు చెక్కును శనివారం కుటుంబసభ్యులకు అందజేశారు. మిగతా నగదును త్వరితగతిన అందించేందుకు కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వూట్ల లక్ష్మయ్య, ఉన్నం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



నందిగామ: మహిళలకు కుట్టు శిక్షణ ద్వారా జీవనోపాధి కల్పించాలన్నదే తమ ఉద్దేశమని గుడ్ విల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఏనోష్ అన్నారు. మండలంలోని కొత్త బెల్లంకొండవారి పాలెంలో శనివారం మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మొత్తం 30 మంది మహిళలకు రెండు నెలలపాటు కుట్టు శిక్షణ పై అవగాహన కల్పించనున్నట్లు వ్యవస్థాపకులు తెలిపారు. 60 రోజుల క్లాసులు పూర్తయిన తర్వాత శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా మిషన్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ శికార్యక్రమాలు పాస్టర్ రాజారావు పర్యవేక్షణలో జరుగుతాయని తెలిపారు.

వైఎస్సార్ సీపీది ప్రజలు మెచ్చిన పాలన

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: సాహసోపేత నిర్ణయాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు మెచ్చిన పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని గూడెంమాధవరం, చెన్నారావుపాలెంలో శనివారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామాలలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సైతం రాజ్యాధికారాన్ని అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. గత ప్రభుత్వాలకు సాధ్యం కాని రీతిలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారికి ఉప ముఖ్యమంత్రి, మంత్రి పదవులు కట్టబెట్టిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని పేర్కొన్నారు.

హామీల అమలుతో ప్రజా మన్ననలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసి ప్రజా మన్ననలు పొందుతున్నారని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తెలిపారు. గత ప్రభుత్వంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేకపోయారని ఇదేమని ప్రజలు అడుగుతుండటంతో మ్యానిఫెస్టో కూడా కనిపించకుండా చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు.

గడప వద్దకే పాలన..

ప్రజల వద్దకు పాలన అని ప్రచారాలు చేయకుండా ప్రజల గడప వద్దకు పాలన తీసుకొచ్చి చూపించిన ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు గుర్తు చేశారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి పూర్తి మద్దతు పలకాలని కోరారు. అనంతరం ఎంపీపీ కోటేరు లక్ష్మీ, ముత్తారెడ్డి వివాహ వార్షికోత్సవం సందర్భంగా దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, సర్పంచ్‌లు బండి సునీత, పత్తిపాటి మల్లికార్జునరావు, ఎంపీటీసీ సభ్యురాలు బండి సీతామహాలక్ష్మీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, నాయకులు అనుమోలు వాసు, బండి మురళి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు

పెనమలూరు: తాడిగడప ఎస్‌టీబీఎల్‌కాలనీలో శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మూడవ రోజు శనివారం స్వామివారికి దివ్య తిరు విశేష కల్యాణ మహోత్సవం చేశారు. ఉదయం సహస్ర కలశాభిషేకం చేశారు. 1008 కలశాలతో శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామివారికి అభిషేకం చేశారు. వేదపండితుల మంత్రాలతో సన్నాయి మేళాలతో ఘనంగా పూజలు చేశారు. గోవింద నామ సంకీర్తనతో గ్రామంలో భక్తి పారవస్యం ఏర్పడింది. అగ్ని రాధన, కుంభారాధన, నిత్య హోమం చేశారు. ఆదివారం భక్తులకు అన్నసమారాధన నిర్వహించనున్నారు. భక్తులు పాల్గొనాలని కమిటీ సభ్యులు సీతారాణి, భారతిప్రసాద్ లు కోరారు.

సవరణ

[illegible]

గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధుల మంజూరు



కీసర శ్రీనివాస్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

కీసర(కంచికచర్ల): గ్రామాల్లో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తగిన నిధులు కేటాయిస్తున్నారని ఆ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని కీసర శ్రీనివాస్‌నగర్‌లో నిర్మాణం చేపట్టిన డ్రెయినేజీ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేందుకు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలకు అవసరమైన నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో మాత్రం వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా పైప్‌లైన్ ఏర్పాటు, పీఏసీఎస్ భవనాల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. చంద్రబాబు పాలనలో గ్రామాల్లో ఎటువంటి మౌలిక వసతులు కల్పించకపోవటంతో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం సిద్ధించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచ్ పేరం నర్సమ్మ, ఎంపీటీసీ సభ్యులు పాపట్ల సీత, ఉప సర్పంచ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధే లక్ష్యం

గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్



శిక్షణ శిబిరంలోని విద్యార్థులతో గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్



పేట గ్రంథాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జమల పూర్ణమ్మ

నందిగామ: జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ పి.జమల పూర్ణమ్మ తెలిపారు. పట్టణంలోని శాఖ గ్రంథాలయాన్ని శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని సందర్శించడంతోపాటు కాసేపు విద్యార్థులతో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లాలో 100 వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి శిక్షణ కేంద్రంలోనూ విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రతి గ్రంథాలయంలోనూ అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. నందిగామ గ్రంథాలయానికి కూడా అవసరమైన అనేక సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. చిన్నారులు వేసవి శిక్షణ శిబిరాన్ని వినియోగించుకునేలా తల్లి దండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. స్థానిక లైబ్రేరియన్ షేక్ మస్తాన్ వలి లైబ్రరీలో పలు వసతులకు సంబంధించి చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె సానుకూలంగా స్పందించారు.

విజ్ఞానాన్ని పెంపొందించేందుకే..

పెనుగంచిప్రోలు: విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసిందని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబు పేర్కొన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం గ్రంథాలయాల్లో విద్యార్థులను కథలు చదివించారు.

జగ్గయ్యపేట అర్బన్: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా విజ్ఞాన జ్ఞాపకాలను పెంపొందించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ టి.జమల పూర్ణమ్మ తెలిపారు. పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 స్థాయి గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ టి.జమల పూర్ణమ్మ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి గ్రంథాలయం పనితీరును, సౌకర్యాలను గురించి పాఠకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తయారుచేసిన పేపర్ క్రాఫ్ట్ వస్తువులను చూసి వారిని అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది, ఉపాధ్యాయుడు టి.ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల : వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో రాష్ట్ర పౌర గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని శనివారం ఆమె సందర్శించారు. శాఖా గ్రంథాలయ గ్రంథ పాలకుడు అట్లూరి రామచంద్రుడు విద్యార్థులకు పలు విభాగాల్లో ఆటలను నిర్వహించారు. భవిత సెంటర్ ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు కనకారావు విద్యార్థులకు కథలతో పాటు డ్యాన్స్‌లు నేర్పించారు. కార్యక్రమంలో నీలం సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు వేలం

నందిగామ: మండలంలోని రాఘవాపురంలో రామలింగేశ్వర స్వామి, మల్లేశ్వర స్వామి ఆలయ భూములకు దేవదాయ శాఖ అధికారులు శనివారం కౌలు వేలం పాట నిర్వహించారు. మొత్తం 12.76 ఎకరాల మెరక భూమికి కౌలు వేలం పాట నిర్వహించారు. స్వామివార్లకు రూ.99,000ల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యాలయ నిర్వహణాధికారి నాగరాజు తెలిపారు. గ్రామ సర్పంచ్ పి.సురేష్, ఆలయ అర్చకులు రాజేష్ శర్మ పాల్గొన్నారు.

పెండ్యాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి పరిశీలన

పెండ్యాల(కంచికచర్ల) : గ్రామాల్లో సిమెంట్‌రోడ్లు, మురుగునీరు పారుదల కోసం డ్రెయినేజీలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం తగిన నిధులు కేటాయిస్తుందని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అన్నారు. మండలంలోని పెండ్యాల ముస్లిం ఏరియాల్లో అంతర్గత గ్రావెల్ రోడ్డును సీసీ రోడ్డుగా మార్చేందుకు శనివారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామంలో అన్ని అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చేందుకు మండల పరిషత్ నుంచి నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామంలో రూ. 1.50కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.10 లక్షలతో కొత్త సిమెంట్ రోడ్డు వేసేందుకు నిధులు కేటాయించామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు షేక్ బడేహజరత్, పంచాయతీరాజ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇంజినీర్ ఆది నారాయణ, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రుద్రవరంలో తప్పిన అగ్ని ప్రమాదం

నందిగామ: మండలంలోని రుద్రవరంలో శనివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం తప్పింది. ఎండిన కంప, పొలంలో ఎండిపోయిన మొక్కజొన్న వ్యర్థాలను తగలబెడుతున్న సమయంలో ఆ మంటలు సమీపంలోని కాలనీని చుట్టుముట్టాయి. దీంతో స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు జిల్లేపల్లి కమల రాము మరికొందరు స్థానికులు వెంటనే ఫైర్ అధికారులకు సమాచారమిచ్చారు. స్పందించిన అధికారులు సకాలంలో గ్రామానికి వచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కెఅగ్రహారం(జగ్గయ్యపేట): గ్రామ సచివాలయంలో రామ్‌కో సిమెంట్స్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రాజాకేశవప్రసాద్ ఆధ్వర్యంలో కంటి వైద్యాధికారి ప్రవీణ రోగులను పరీక్షించి 103 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆవుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.